# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 37 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 25, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## దాశరథి రంగాచార్యకి రేవంత్ రెడ్డి నివాళి



ఢిల్లీ,(నమస్తే ఉదయం): సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు స్వర్గీయ దాశరథి రంగాచార్య జయంతి సందర్భంగా ఆ బహుభాషా కోవిదుడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఢిల్లీలోని అధికారిక నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ముఖ్యమంత్రి దాశరథి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా నాటి పరిస్థితులపై అనేక రచనలతో దాశరథి రంగాచార్య తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని ముఖ్య మంత్రి గుర్తుచేసుకున్నారు. వేదాలను తెలుగులోకి అనువ దించడం వంటి విప్లవాత్మక చర్యలతో దాశరథి రంగాచార్య చరిత్రలో తనదైన ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## జమ్మూ కాశ్మీర్‌లో ఒంటరిగానే పోటీచేస్తాం..

- అంబేద్కర్ రాజ్యాంగం వద్దు.. జిన్నా రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నం
- రిజర్వేషన్లు తొలగిస్తామంటున్న నేషనల్ కాన్ఫరెన్స్‌తో ఎలా చేతులు కలుపుతారు?
- జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేకంగా ఓ జెండా ఉండాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ హామీని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా?
- ఉగ్రవాదులను విడుదల చేస్తామంటున్న ఎన్సీకి మద్దతుగా ఉంటారా?
- శంకరాచార్య పర్వతం పేరును మారుస్తామంటే ఎందుకు మాట్లాడటం లేదు?
- జమ్ముకశ్మీర్ ఎన్నికలకు సంబంధించి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్ట్ 24(నమస్తే ఉదయం): జమ్మూకశ్మీర్ ఎన్నికలకు సంబంధించి.. నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టో విడుదల అనంతరం, విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే .. మొన్న ఫారుఖ్ అబ్దుల్లా ఇంటికెళ్లి ఒప్పందం చేసుకుని వచ్చారు. నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టోలో దేశ భద్రతను ప్రశ్నించే అంశాలపై కాంగ్రెస్ ఆలోచన ఏంటి? అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామని.. అన్న నేషనల్ కాన్ఫరెన్స్‌ను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా? చేతిలో రాజ్యాం గాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీ ఎప్పుడైనా రాజ్యాంగాన్ని చదివారో లేదో నాకు తెలియదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రిజర్వేషన్ల విషయంలో బీజేపీపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తి.. ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లో రిజర్వేషన్లు మిగతా.. 2లో

## విద్యుత్ శాఖలో భారీగా పలువురు సూపరింటెండింగ్ ఇంజినీర్ల బదిలీలు

హైదరాబాద్, ఆగస్ట్ 24(నమస్తే ఉదయం):
విద్యుత్ శాఖలో (టీజీ ఎస్పీడీసీఎల్) భారీగా ఎస్ఈల బదిలీలు జరిగాయి.
సైబర్ సిటీ సర్కిల్ ఏస్ ఈ గా టి చంద్ర శేఖర్,
రాజేంద్ర నగర్ సర్కిల్ ఏస్ ఈ గా డి శ్రీరామ్ మోహన్,
మేడ్చల్ సర్కిల్ ఏస్ ఈ గా ఎం రవి కుమార్
హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఏస్ ఈ గా డి సోమి రెడ్డి(ఇటీవల ఎస్ ఈగా పొందాడు),
సరూర్ నగర్ సర్కిల్ ఏస్ ఈ గా సి మాధవ రెడ్డి,
సికింద్రాబాద్ సర్కిల్ ఏస్ ఈ గా ఎల్ గోపయ్య,
బంజారాహిల్స్ సర్కిల్ ఏస్ ఈ గా పి కరుణాకర్ బాబు,
హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఏస్ ఈ గా పి వెంకన్న
సంగారెడ్డి సర్కిల్ ఏస్ ఈగా శ్రీనాథ్, యాదాద్రి ఎస్ఈ గా సుధీర్ లను బదిలీ చేస్తూ సంస్థ సీఎం డి ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం హబ్సిగూడ సర్కిల్ ఏస్ ఈగా బ్రహ్మంని బదిలీ చేశారు.







## ఉద్దేశపూర్వకంగానే తనపై కేసులు

- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టలేదు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్24(నమస్తే ఉదయం): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి కేసులు పెడుతోందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మిగతా.. 2లో

## ఆక్రమణ కూల్చివేతలకే హైడ్రా ఏర్పాటు

- పదేళ్ల కాలంలో ఆక్రమణలపై దృష్టి పెట్టాం
- ప్రజలు ఆక్రమణల కూల్చివేతలను హర్షిస్తున్నారు
- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై డిప్యూటి సిఎం భట్టి



న్యూఢిల్లీ,ఆగస్ట్24(నమస్తే ఉదయం): హైదరాబాద్‌లో హైడ్రా కూల్చి వేతలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమర్థించారు. గత కొన్నేళ్లుగా రాజధానిలో చెరువులను, ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసి అక్రమ నరిూణాలు చేప్టారని అన్నారు. వీటిని కూల్చేయడం సరైందేనని అంటూ..ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్పందించారు. శని వారం మీడియాతో మాట్లాడుతూ... హైదరాబాద్ నగరం అంటేనే లేక్స్, రాక్స్ మిగతా.. 2లో



## చట్ట ప్రకారమే ఎన్ కన్వెన్షన్ కూల్చివేశాం..

- చెరువులోనే ఎన్ కన్వెన్షన్ నిర్మాణం
- నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతి లేదు
- స్టే ఉన్నట్లు బుకాయిస్తున్నారు
- ఇంతకాలం మేనేజ్ చేస్తూ వచ్చారు
- క్రమబద్ధీకరణ యత్నాలను అడ్డుకున్న అధికారులు
- చెరువును పూర్తిగా కబ్జా చేసి నిర్మాణాలు
- కూల్చివేతపై స్పందించిన హైడ్రా కమిషనర్


హైదరాబాద్,ఆగస్ట్24(నమస్తే ఉదయం): మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై హైడ్రా స్పందించింది. చట్ట ప్రకారమే ఎన్ కన్వెన్షన్‌లోని కట్టడాలను కూల్చివేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్‌పై ఎలాంటి స్టే లేదని.. హైకోర్టులో స్టే ఇచ్చినట్టుగా చెప్తుంది పూర్తిగా అవాస్తవమన్నారు. ఎఫ్టీఎల్‌లో కట్టడాలు ఉన్నందునే కూల్చి వేయడం జరిగిందన్నారు. చెరువుని పూర్తిగా కబ్జా చేసి నిర్మాణాలు చేశారని.. చట్ట ప్రకారమే హైడ్రా వ్యవహరించి కట్టడాలను కూల్చివేసిందని ఆయన వెల్లడించారు. కట్టడాలను క్రమబద్ధీ కరించుకునేందుకు ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం ప్రయత్నించిందని.. ఎన్ కన్వెన్షన్ రిక్వెస్ట్‌ను అధికారులు గతంలోనే తిరస్కరించారని తెలిపారు. ఎన్ కన్వెన్షన్ పైన ఇప్పటికే లోకాయుక్తతో పాటు హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. ఎన్ కన్వెన్షన్‌లో పూర్తిగా అన్ని కట్టడాలను నేలమట్టం చేశామని.. ఎన్ కన్వెన్షన్ ప్రస్తుతం జీరోగా మారిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

ఇదెలా ఉండగా.. తమ్మిడికుంట చెరువు ఖానామెట్ గ్రామం, మాదాపూర్‌లోని ఎఫ్టీఎల్‌లో ఉన్న ఆక్రమణలను జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు తొలగించారని హైడ్రా ఓ ప్రకటనలో పేర్కొంది. తొలగించిన అనేక మిగతా.. 2లో



## చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైకోర్టు తీర్పు

- మళ్లీ నాగార్జునకు స్టే ఎలా ఇస్తారు
- జడ్జిలు దీనిపై పునరాలోచన చేయాలి
- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై 2014లోనే ఉత్తర్వులు
- కెటిఆర్ హయాంలో అనేక చెరువులు మాయం
- మెదక్ ఎంపి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,ఆగస్ట్24(నమస్తే ఉదయం): పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ చేసినన్ని తప్పులు ఎవరూ చేయ లేదని భాజపా మెదక్ ఎంపీ రఘు నందన్‌రావు దుయ్యబట్టారు. ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టాలని హైకోర్టు 2014లోనే ఉత్తర్వులిచ్చిందని, కానీ, పదేళ్లు అధికారంలో ఉన్న భారాస కూలగొట్టలేదని అన్నారు. ఇందుకు దీనిని తొక్కి పెట్టారో కెటిఆర్ చెప్పాలన్నారు. కోర్టు ఆదేశాలను కూడా బేఖాతర్ చేశారని మండిపడ్డారు. మిగతా.. 2లో



## మహిళల పట్ల వ్యాఖ్యలు

- ఇప్పటికే విచారం వ్యక్తం చేస్తూ ప్రకటన
- మహిళా కమిషన్ ముందు హాజరైన కెటిఆర్
- రాష్ట్రంలో మహిళల సమస్యలపై కమిషన్‌కు ఫిర్యాదు
- రాఖీలు కట్టి పెద్ద మనసు చాటుకున్న మహిళా కమిషన్ సభ్యులు

హైదరాబాద్,ఆగస్ట్24(నమస్తే ఉదయం): తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మహిళా కమిషన్ ముందు మిగతా.. 2లో

## వైద్యరంగాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బిఆర్ఎస్ పాలనలో అద్భుతంగా అభివృద్ధి చేశాం
- ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్24(నమస్తే ఉదయం): బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వైద్య రంగం ఉన్నత శిఖరాలకు చేరిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అనేక విప్లవాత్మక పథకాలకు, తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.

నిర్దిష్టమైన ప్రణాళిక, పటిష్టమైన చర్యలతో వైద్యరంగంలో అట్టడుగున ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని హరీశ్‌రావు అన్నారు. కానీ ఈ తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్య, ఆరోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. కాంగ్రెస్ పాలన పుణ్యమా అని మళ్లీ.. 'నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు' అనే రోజులు పునరావృతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పటల్స్ ఘనతను చాటేలా వార్తలు వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల అధ్వాన్న పరిస్థితుల గురించి రోజూ వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'పడకేసిన ప్రజారోగ్యం, రోగుల మందులు ఎలుకల పాలు, కుర్చీలోనే గర్భిణీ డెలివరీ, ఒకే బెడ్ పై ముగ్గురికి ట్రీట్మెంట్' ఇవన్నీ ఈ ఒక్క రోజు పత్రికల్లో వైద్య ఆరోగ్యశాఖపై నిర్వాకంపై వచ్చిన వార్తా కథనాలు అని ప్రస్తావించారు. ప్రజారోగ్య సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వా నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని తెలిపారు. మిగతా.. 2లో



## నిర్దుష్ట ప్రదేశాల్లోనే గణేశ్ మండపాలు

- స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- వివరాలను పోలీసు శాఖకు అందచేయాలి
- కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలి
- గణేశ్ ఉత్సవాల సమన్వయ సమితి సమావేశంలో సిపి

హైదరాబాద్,ఆగస్ట్24(నమస్తే ఉదయం): వచ్చే నెల సెప్టెంబర్ 7వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా వినాయక మిగతా.. 2లో

## ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలు

- మాజీ ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్‌పై సీబీఐ కేసు

కోల్‌కతా,ఆగస్ట్24(నమస్తే ఉదయం): ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఆర్థిక అవకతవకలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్‌పై సీబీఐ శనివారం కేసు నమోదు చేసింది. ప్రొ.ఘోష్‌పై కేసు నమోదు చేయాలని కోల్‌కతా హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు నమోదు చేసింది. ప్రొ. సందీప్ ఘోష్‌పై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో వాటిపై సీబీఐ విచారణ జరప నుంది. దాంతో సిట్ అధికారులు శనివారం ఉదయం కోల్‌కతాలో నిజాం ప్యాలెస్‌లోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి.. ప్రొ. ఘోష్‌కు సంబంధించిన అన్ని పత్రాలు అందజేసినట్లు సీబీఐ అధికారిక మిగతా.. 2లో






## ఉద్యోగుల సామాజిక భద్రతకు నిర్ణయం

- యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని ఆమోదించిన కేబినేట్

న్యూఢిల్లీ,ఆగస్ట్24(నమస్తే ఉదయం): కేంద్ర కేబినెట్ మూడు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. బయో ఈ-3 విధానంతోపాటు విజ్ఞాన్ ధార పథకం, 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పనకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. ఉద్యోగుల సామాజిక భద్రత కోసం కేంద్రం యూనిఫైడ్ పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. సుమారు 23 లక్షల మంది ఉద్యోగులు లబ్ది పొందుతారన్నారు. మిగతా.. 2లో

## ఉద్దేశపూర్వకంగానే తనపై కేసులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తనను, అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎంత కక్షపూరితంగా వ్యవహరించినా తాను మాత్రం చట్ట ప్రకారమే నడుచుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..' అనురాగ్ యూనివర్సిటీ నిర్మాణానికి చట్ట ప్రకారం అన్నీ అనుమతులు తెచ్చుకున్నా. ఆగస్టు 22, ఇరిగేషన్ ఇంజినీర్ మా విశ్వవిద్యాలయాన్ని పరిశీలించారు. మరుసటి రోజు గాయత్రి ట్రస్ట్, అనురాగ్ సంస్థలు నాదం చెరువు బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ ఫిర్యాదు చేశారు. పోలీసులు మమ్మల్ని కనీస సమాచారం అడగకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గాయత్రి ట్రస్ట్, అనురాగ్ సంస్థలు గత 25ఏళ్లల్లో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టలేదు. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి పరిశీలించి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో లేవంటూ ఎన్‌వోసీ ఇచ్చారు. 2018లో అప్పటి మేడ్చల్ కలెక్టర్ జిల్లాస్థాయి కమిటీ వేసి పరిశీలించిన తర్వాతే ఎన్‌వోసీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఎయిర్‌పోర్ట్ అథారిటీలు అన్నీ ఎన్‌వోసీలు ఇచ్చాయి. అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అన్ని శాఖల అనుమతులు పరిశీలించిన తర్వాతే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం నాపై, నా సంస్థలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. జనగామలో వ్యక్తిగతంగా నాపై నాలుగు కేసులు, హైదరాబాద్ లో రెండు కేసులు పెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అనురాగ్ యూనివర్సిటీపై అన్ని శాఖలతో నిత్యం సోదాలు చేయిస్తున్నారు. ఏమీ దొరక్కపోవడంతో 2017లో అనుమతులు ఇచ్చిన ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నాపై మరో కేసు నమోదు చేయించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎంత వేధించినా చట్ట పరిధిలో న్యాయం కోసం పోరాటం చేస్తా' అని చెప్పారు.

## ఆక్రమణ కూల్చివేతలకే హైడ్రా ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

అని.. వీటిని కాపాడుకోవాలంటూ పర్యావరణవేత్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశారన్నారు. చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. చెరువులు ఏవీ ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించడం కోసం ఏర్పాటు చేసిందే హైడ్రా అని చెప్పుకొచ్చారు. దీన్ని ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రతి పనికి నోటీసులు ఇచ్చి ఆపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. బఫర్ జోన్‌లో కాదు, నేరుగా చెరువులోనే కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్నారన్నారు. సాటిలైట్ ఫోటోల ద్వారా విభజనకు ముందు, విభజన తర్వాత ఈ 10 ఏళ్లలో చెరువులు ఎంత మేర ఆక్రమణకు గురయ్యాయి తెలుసుకుంటున్నామని తెలిపారు. రిమోట్ సెన్సింగ్ సాటిలైట్ ఫోటోలను తీసి, అంతకుముందు ఎన్ని చెరువులు ఉండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయి అన్నది ప్రజల ముందు పెడతామన్నారు. చట్ట ప్రకారం, చట్టానికి లోబడి మాత్రమే చర్యలు చేపడతున్నామన్నారు. అన్నీ లెక్కలతో సహా ప్రజల ముందు పెడతామన్నారు. ప్రజల ఆస్తులను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## వైద్యరంగాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

వానాకాలం వస్తున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఆస్పత్రుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించకపోవడం పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల మలేరియా, డెంగీ లాంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. ప్లలె, పట్టణం అని తేడా లేకుండా వైరల్ ఫీవర్లతో ప్రతి ఇద్దరిలో ఒకరు బాధపడుతున్నారని.. ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గడచిన నెలన్నర కాలంలో 5246 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే 36? డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయని అన్నారు. జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు? అని మండిపడ్డారు. మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు ఏమని సమాధానం చెబుతుందని నిలదీశారు. మీకు రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంతోమంది కుటుంబాల్లో అంతులేని దుఃఖాన్ని మిగిలించిందని అన్నారు. ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని స్పష్టం చేశారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మరణించిన వారికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటే ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య ఆరోగ్యశాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

## ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలు

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి. అలాగే ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని అలీపూర్‌లోని చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు అందజేసినట్లు సీబీఐ వివరించింది. ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్ హయాంలో ఆర్ జీ కర్ మెడికాల్ కాలేజీలో భారీగా ఆర్థిక అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ కేసును సిట్ నుంచి సీబీఐకి బదిలీ చేయాలని ఇటీవల కోల్‌కతా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తునకు సంబంధించిన పత్రాలను సీబీఐకి సిట్ అధికారులు అందజేశారు. సందీప్ ఘోష్ ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ ఆ కాలేజీ మాజీ డిప్యూటీ సుపరింటెండెంట్ ఆక్తర్ అలీ కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈడీతో విచారణ జరపాలని ఆయన తన పిటిషన్‌లో కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అలాగే ఈ కేసు విచారణ జరిపి మూడు వారాల్లో నివేదిక సమర్పించాలని సీబీఐకు కోల్‌కతా హైకోర్టు స్పష్టం చేసింది. రోవైపు ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసులో శనివారం ప్రొ. సందీప్ ఘోష్‌తోపాటు మరో ఆరుగురుకి సీబీఐ పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఆగస్ట్ 9వ తేదీన ఈ కాలేజీలో 32 ఏళ్ల ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు.అతడితోపాటు ఆ రోజు ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యులకు సీబీఐ పాలీగ్రాఫీ పరీక్షలు నిర్వహించింది. ఈ హత్యాచార ఘటన జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆసుపత్రి ప్రిన్సిపల్ పదవికి రాజీనామా చేశారు. దీంతో మమతా బెనర్జీ ప్రభుత్వం ఆయన్ని మరో కీలక పదవిలో నియమించింది. ఈ నియామకంపై హైకోర్టు స్పందించింది. ఆయన్ని దీర్ఘ కాలిక సెలవుపై పంపాలని ఆదేశాలు జారీ చేసింది.

## ఉద్యోగుల సామాజిక భద్రతకు నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

దీని కోసం రూ.10,579 కోట్ల వ్యయం అవుతుందన్నారు. పారిశ్రామిక, ఐటీ విప్లవాల మాదిరిగా త్వరలో బయో విప్లవం రాబోతోందని చెప్పారు. బయో టెక్నాలజీ, బయో సైన్స్ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రమంత్రి మండలి సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి మూడు పథకాలకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి వీటిని విజ్ఞాన ధార పథకంలో విలీనం చేసింది. ఈ పథకం కోసం 2021-22 నుంచి 2025-26 వరకు 15వ నాన్స్ కమిషన్ కాలానికి రూ.10,579 కోట్లను కేటాయించారు. ఈ పథకంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో మానవ సామర్థ్యం పెంపు, పరిశోధనలు, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధి, విస్తరణపై ప్రత్యేక దృష్టి కేంద్రకరించనున్నారు.

# జమ్మూ కాశ్మీర్‌లో ఒంటరిగానే పోటీచేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

తొలగిస్తా మంటున్న నేషనల్ కాన్ఫరెన్స్‌తో ఎలా చేతులు కలుపుతారు?

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేకంగా ఓ జెండా ఉండాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ హామీని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా?

అధికారంలోకి వస్తే.. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35-ఎ తీసుకొచ్చి తద్వారా.. జమ్మూకశ్మీర్‌లో అశాంతి, ఉగ్రవాదం పెంచాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ ఆలోచనకు కాంగ్రెస్ మద్ద తిస్తుందా? దేశ ప్రజలకు చెప్పాలి. అంబేద్కర్ రాజ్యాంగం వద్దు, జిన్నా రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి కాంగ్రెస్ మద్దతిస్తుందా? వీటికి రాహుల్ గాంధీ సమాధానం ఇవ్వాలి?

మేం దళితులు, బీసీలు, గిరిజనుల రిజర్వేషన్ల కోసం మేం చేస్తున్న ప్రయత్నాలకు నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. అలాంటి పార్టీకి మద్దతు ఇవ్వడం ద్వారా జమ్మూకశ్మీర్ పేదల రిజర్వేషన్లు తొలగించా లనేదే కాంగ్రెస్ ఉద్దేశమా?

ఉమెన్ కమిషన్, ఫారెస్ట్ డ్వెల్లర్స్ చట్టం, సఫాయీ కర్మచారి వంటి ఎన్నో చట్టాల ద్వారా మేం జమ్మూకశ్మీర్లో మార్పులు తీసుకొస్తే.. వాటిని తొలగించాలని ఎన్సీ చెబుతోంది. దీన్ని కాంగ్రెస్ సమర్థిస్తుందా? ఉగ్రవాదులను విడుదల చేస్తామం టున్న ఎన్సీకి మద్దతుగా ఉంటారా? కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి.

పాకిస్తాన్ తో మళ్లీ చర్చలు జరపడం, తద్వారా లోయలో మళ్లీ వేర్పాటువాదాన్ని ప్రోత్సహించాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ ఆలోచనకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందా?

పాకిస్తాన్ తో 'సరిహద్దు వాణిజ్యం' పేరుతో.. జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదాన్ని పెంచాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ కుట్రను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా?

ఉగ్రవాదం, భద్రతా బలగాలపై రాళ్లు రువ్వడం వంటి కేసుల్లో ఉన్నవారి బంధువులందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం ద్వారా.. ఉగ్రవాదాన్ని, రాళ్లు రువ్వడం, రోడ్లు బంద్ చేయడం వంటి అరాచక కార్యక్రమాలకు కాంగ్రెస్ మద్ద తిస్తుందా? నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో జతకట్టడం ద్వారా.. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల వ్యతిరేక కుట్ర మరోసారి బహిర్గతమైంది. దళిత, గుజ్జర్, బకర్‌వాల్, ఇతర కొండజాతి వర్గాల రిజర్వేషన్లకు చరమగీతం పాడాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ దురుద్దేశాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందా?

'శంకరాచార్య హిల్' ను 'తఖ్తే సులేమాన్'గా.. 'హరిపర్వత్' ను'కోహే మారన్'గా పేరు మార్చడాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా? పాలనను కొందరు పాకిస్తాన్‌కు మద్దతుగా ఉండే కుటుంబాలకు కట్టబెట్టడం ద్వారా.. జమ్మూకశ్మీర్ ఆర్థిక పరిస్థితిని మళ్లీ అవినీతి, అక్రమాల్లోకి నెట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా?

జమ్మూ, కశ్మీర్ లోయ మధ్య వివక్ష రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందా?

కశ్మీర్ కు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండ్‌తో.. రాష్ట్రంలో విభజన రాజకీయాలకు బాటలు వేస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్ కుట్రలు, కుతంత్రాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందా?

370ని రద్దు చేసిన తర్వాత మోదీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్లో అభివృద్ధి జరుగుతోంది, అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ రాష్ట్రాన్ని వెనక్కు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. జమ్మూ కాశ్మీర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. రానున్న ఎన్నికలు మీ అభివృద్ధిని కొనసాగించే ఎన్నికలు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

పాకిస్తాన్ తో చర్చించడం అవసరమా? ఉగ్రవాదులను మన దేశంలోకి విధ్వంసానికి కారణమవుతున్న పాకిస్తాన్ తో చర్చలు అవసరమా? ఇలాంటి ఆలోచనలు చేయడం సరైందేనా అనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు చెప్పాలి.

నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను సమర్థిస్తారా?

పశ్చిమబెంగాల్‌లో యువ డాక్టర్‌పై హత్యాచారం జరిగితే రాహుల్ ఎందుకు మాట్లాడరు?

ఔరంగజేబ్ రోడ్డు పేరు మారిస్తే..దేశమంతా ఆందోళనలు చేసిన స్వయం ప్రకటిత మేధావులు .. జమ్మూకశ్మీర్లో పవిత్రమైన శంకరాచార్య పర్వతం పేరును మారుస్తామంటే ఎందుకు మాట్లాడటం లేదు?

బీజేపీ జమ్మూ కాశ్మీర్ లో ఒంటరిగానే పోటీచేస్తాం. పార్టీ నిర్ణయించిన సీట్లలో పోటీచేస్తాం.

# నిర్దుష్ట ప్రదేశాల్లోనే గణేశ్ మండపాలు

(మొదటి పేజీ తరువాయి)

చవితి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభంకానున్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగాపెద్ద ఎత్తున గణేష్ ఉత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే విగ్రహాల తయారీ పూర్తయి అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు వినాయక మండపాల ఏర్పాటు సైతం స్టార్ట్ అయ్యింది. వినాయక చవితికి మరో రెండు వారాల సమయం మాత్రమే ఉంటడంతో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌కు సంబంధిత అధికారులతో పాటు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. నిర్దిష్ట ప్రదేశాల్లోనే గణేషుడి మండపాలు ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగుండా చూడాలని నిర్వహకులకు సూచించారు. మండపం ఏర్పాటుతో పాటు నిమజ్జనం వేళ కోర్టు ఆదేశాలు పాటించాలని చెప్పారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనానికి తగిన సంఖ్యలో క్రేన్లు ఏర్పాటు చేయాలని, రోడ్ల మరమ్మతు పనులు, లైట్ల ఏర్పాటు, విద్యుదాఘాత నివారణ చర్యలు చేపట్టాలని.. భారీ వాహనాలు సులువుగా వెళ్లేందుకు చెట్లు కత్తిరించడం వంటి పనులు చేపట్టాలని

సంబంధిత శాఖలకు సూచించారు. ఇంటిమేషన్ ఫారమ్‌లను సక్రమంగా పూరించాలని ఉత్సవ సమితిలకు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పకడ్బందీ ప్రణాళికతో వినాయక ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి , ఖైరతాబాద్ గణేష్ సమితి ప్రతినిధులు పండుగకు సంబంధించిన గుంతలు, నిర్దిష్ట ప్రదేశాలలో తగినంత వెలుతురు ఆవశ్యకత, మండపం నిర్వాహకులకు వాహనాల లభ్యత, రాత్రి నిమజ్జన సమయంలో ఆహారం, నీటి ఏర్పాట్లు తదితర సమస్యలను లేవనెత్తారు. మెటీరియల్ , సిబ్బంది, తగిన సంఖ్యలో క్రేన్లు, రోడ్ల మరమ్మతు పనులు, లైట్ల ఏర్పాటు, విద్యుదాఘాత నివారణ చర్యలు, ఏనుగులు , ఇతర భారీ వాహనాలు , చెట్లకు అవసరమైన వనరులను కేటాయించాలని చేసిన అభ్యర్థనలకు సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. కోర్టు ఆదేశాలను పాటించాలని నిర్వాహకులను కమిషనర్ కోరారు.

ఉత్సవ సమితిలు ఇంటిమేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపాలని విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బంది లేదా అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తుందని హామీ ఇచ్చారు. ఉత్సవాల సమయంలో భక్తులకు, ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడానికి , 2024 గణేష్ ఉత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి వివిధ శాఖల నుండి సహకారాన్ని కోరింది.

## మహిళల పట్ల వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

విచారణకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చి రాజకీయం చేశారన్నారు. భారాస మహిళా నేతలపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను గౌరవించాలని విచారణకు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వసతి గృహాల్లో పిల్లల సమస్యలపై ప్రస్తావించినట్లు కేటీఆర్ తెలిపారు. అంతకుముందు విచారణ సందర్భంగా కేటీఆర్‌కు మహిళా కమిషన్ సభ్యులు రాఖీలు కట్టారు. మహిళలపై తాను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చేందుకు ఈరోజు మహిళ కమిషన్ ముందు కేటీఆర్ హాజరయ్యారు. వివరణ ఇచ్చేందుకని ఆయన వస్తే.. మహిళా కమిషన్ సభ్యులు పోటీలు పడి మరీ రాఖీలు కట్టడం ఒకింత ఆశ్చర్యంగా అనిపించింది. విచారణకు పిలిచి కేటీఆర్‌కు రాఖీ కట్టి సోదర అనుబంధాన్ని మహిళా కమిషన్ సభ్యులు చాటుకున్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ విషయంలో మహిళలపై తాను చేసిన కామెంట్స్ యథాలాపంగా చేసినవేనని కేటీఆర్ వివరణ ఇచ్చారు. మహిళలంటే తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలపై ఇటీవల జరిగిన దాడులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. నెల 15వ తేదీన తెలంగాణ

భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంలో మంత్రి సీతక్క ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై కొంతమంది చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్, రికార్డింగ్ డాన్సులు చేసినా తాము ఏమంటామని అంటూ వ్యంగ్యంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున రచ్చ జరిగింది. హిళలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. మహిళల గురించి వివాదాస్పద కామెంట్స్ చేశారని మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి నోటీస్ ఇచ్చింది.

ఈ క్రమంలోనే ఇవాళ కేటీఆర్ మహిళ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే ఆయన క్షమాపణ చెప్పారు. యథాలాపంగా అన్నవే తప్పా మహిళలను అవమానించే ఉద్దేశం తనకు లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైకోర్టు తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెరువులు ఎక్కడెక్కడ కబ్జా చేశారో పదేళ్ల అధికారంలో ఉన్న కేటీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. భారాస, కాంగ్రెస్ నేతలు పరస్పరం తిట్టుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా బృందం కూల్చివేసిన ఘటన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది. మూడున్నర ఎకరాలు తుమ్మడి చెరువును కబ్జా చేసి కన్వెన్షన్‌ను నిర్మించారని అధికారులకు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన హైడ్రా నేలమట్టం చేసింది. ఈ క్రమంలో హైకోర్టునుఆశ్రయించడంతో నాగార్జునకు ఊరట లభించింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. కూల్చివేతలను ఆపేయాలని హైకోర్టు శనివారం నాడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ ఉత్తర్వులపై బీజేపీ ఎంపీ రఘునందనరావు స్పందించారు. 'గౌరవ న్యాయ మూర్తులకు విజ్ఞప్తి.. లంచ్ మోషన్ అని.. ఆగం ఆగం కేసులు వినకండి. ఒక్క బిల్డింగ్ కూలిపోతే ఏమవుతుంది.. 2007, 2008లో చెరువుల కాపాడాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. చెరువులో నిర్మాణాలు ఉంటే ఎలాంటి నోటిసులు ఇవ్వకుండా కూల్చాలని సుప్రీంకోర్టు చెప్పింది.

మళ్ళీ జడ్జీలు స్టే ఇచ్చుడు ఏంది..? పిల్లలు నాలల కొట్టుకోపోతే ఏం చేశారు..?. డీ మార్కు చేసిన అనుమతులు లేకుండా కట్టిన నిర్మాణలను కూల్చివేయాలని హైకోర్టు చెప్పింది. ఒక్కసారి హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మళ్ళీ హైకోర్టు జడ్జిలు చేయబడమేంటి..?. దయచేసి హైకోర్టు జడ్జిలు కూడా హైదరాబాద్ చెరువుల పరిరక్షణకు సహకరించాలని న్యాయస్థానానికి రఘునందనరావు విజ్ఞప్తి చేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డ్రామాలు రక్తికట్టించేలా మాట్లాడుతున్నారు. 1994కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో మిరాలం చెరువు కబ్జాపై స్పందించారు. 2010లో ఎఫ్టీఎల్, శిఖంలలో ఎవరు ఏం కట్టినా కూల్చివేయాలని కోర్టు చెప్పింది. 157జీవోను 6 /4 2010లో ప్రభుత్వం తీసుకుని వచ్చింది. 18మందితో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పుడు మీరాలం ట్యాంక్ పరిస్థితి ఏంటో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. ఎన్ కన్వెన్షన్‌ను 2014లో కూల్చివేయమని హైకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి.. ఎన్ కన్వెన్షన్ వెనుక ఉన్న లాలూచీ ఏంటో కేటీఆర్ చెప్పాలి. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా అధికారులతో కలిపి అధికారుల కమిటీ వేశారు. ముందు కేటీఆర్ జన్వాడా ఫాం హౌస్ కూల్చి వేయండి. కవిత, కేటీఆర్ ఫాం హౌస్‌ను కూల్చేందుకు ఎందుకు భయపడుతున్నారు. హైడ్రా వేసింది మంచి ఉద్దేశ్యంతో అయితే బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కట్టడాలు కూల్చి వేయాలి. కబ్జాలను పాల్పడిన నేతలపై కేసులు పెడితే వారిని ఎందుకు అరెస్టు చేయలేదు. రాజ్ భవన్ రోడ్‌లో నాలాలపై ఆసుపత్రి కట్టారు.. భారీ భవనాలను నిర్మించారు. చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోని కేటీఆర్‌ను మొదటి ముద్దాయిగా అరెస్టు చేయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండరాదన్నారు. ఈ విషయంలో చిత్తశుద్ధిని చాటాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# చట్ట ప్రకారమే ఎన్ కన్వెన్షన్ కూల్చివేశాం..

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాలలో ఎన్- కన్వెన్షన్ కూడా ఒకటని తెలిపింది. 2014లో హెచ్ఎండీఏ తమ్మిడికుంట సరస్సు ఎఫ్టీఎల , బఫర్ జోన్‌లకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2016లో తుది నోటిఫికేషన్ విడుదలైంది. 2014లో ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత ఎన్ కన్వెన్షన్ హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించి చట్టబద్ధమైన పక్రియను అనుసరించాలని హైకోర్టు ఆదేశించింది. దీని ప్రకారం పిటిషనర్ ఎన్ కన్వెన్షన్ సమక్షంలో ఎఫ్టీఎల్ సర్వే నిర్వహించబడింది

ఎన్- కన్వెన్షన్ పై 2017 నుండి కేసు పెండింగ్‌లో ఉంది. ఏ కోర్టు నుండి ఎటువంటి స్టే ఉత్తర్వులు లేవని హైడ్రా తెలిపింది. ఎన్- కన్వెన్షన్ ఎఫ్టీఎల్,బఫర్ జోన్‌లలో నిర్మించిన అనధికారిక నిర్మాణాల ద్వారా సిస్టమ్స్ / ప్రాసెస్‌ను స్పష్టంగా తారుమారు చేస్తోందని..వాణిజ్య కార్యకలాపాలను కొనసాగిస్తోందని హైడ్రా పేర్కొంది. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ ఎన్-కన్వెన్షన్‌కు ఎటువంటి భవన నిర్మాణ అనుమతిని ఇవ్వలేదని స్పష్టం చేసింది హైడ్రా. ఎన్ కన్వెన్షన్ బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ కింద అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించడానికి ప్రయత్నించింది, కానీ సంబంధిత అధికారులచే తిరస్కరించారని వెల్లడించింది. టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత వివాదాస్పదం అవుతోంది. అది పట్టా భూమి అని, అందుకే నిర్మాణం చేపట్టినట్లు నాగార్జున చెబుతున్నారు. కోర్టులో స్టే ఉన్నా, హైడ్రా అధికారులు చట్టవిరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేశారని ఆయన ఆరోపించారు. అయితే అక్కడ భూమిని ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించినట్లు హైడ్రా స్పష్టం చేసింది. కూల్చివేతపై కీలక ప్రకటన చేసింది. ఎఫ్‌టిల్ పరిధిలో ఒక ఎకరం 12 గుంటలు, బఫర్ జోన్‌లో 2 ఎకరాల 18 గుంటల



భూమిని ఎన్ కన్వెన్షన్ ఓనర్ ఆక్రమించినట్లు హైడ్రా తెలిపింది. ఎన్ కన్వెన్షన్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా స్పందించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. తమ్మిడికుంట చెరువు, ఎఫ్‌టిఎల్, బంఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాం. ఈ రోజు కూల్చిన నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ ఒకటి. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు జరిపారు అని హైడ్రా స్పష్టం చేసింది. తుమ్మిడికుంట, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై 2014లోనే హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేసింది. 2016లో హెచ్ఎండీఏ ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2014లో హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేశాక ఎన్ కన్వెన్షన్ హైకోర్టును ఆశ్రయించింది. నిబంధనలు ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించమని హైకోర్టు సూచించింది. ఎన్ కన్వెన్షన్ ప్రతినిధుల సమక్షంలోనే ఎఫ్‌టీఎల్ సర్వే చేసి నివేదిక అందించాం. మేమిచ్చిన నివేదికపై ఎన్ కన్వెన్షన్ ప్రతినిధులు మియాపూర్ అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించారని హైడ్రా పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ఎలాంటి స్టే ఇవ్వలేదు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ.. ఎన్ కన్వెన్షన్ వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒక ఎకరం 12 గుంటలు, బఫర్ జోన్‌లో 2 ఎకరాల 18 గుంటలను ఎన్ కన్వెన్షన్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వంలో ఆక్రమణలను రెగ్యులర్ చేయించుకునేందుకు ఎన్ కన్వెన్షన్ ప్రయత్నించింది.. కానీ అధికారులు తిరస్కరించారు. తమ్మిడికుంట చెరువు ఆక్రమణల వల్ల హైటెక్స్ పరిధిలోని నాలాలు మూసుకుపోయి వరద వస్తుంది. ఆక్రమణల వల్ల తమ్మిడికుంట చెరువు 50 నుంచి 60 శాతం వరకు కూచించుకుపోయిందని హైడ్రా వెల్లడించింది.



## భాగ్యనగర్ 2024 గణేష్ ఉత్సవ సమితి

**కొత్తకోట, ఆగస్టు 24(నమస్తే ఉదయం):**
భాగ్యనగర్-2024 గణేష్ ఉత్సవ సమితి రాజేందర్ నగర్ కన్వీనర్ వై శ్రీధర్, కో కన్వీనర్ బొక్క బాల్ రెడ్డి కోకన్వీనర్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సామ భూపాల్ రెడ్డి గార్డెన్ ఉప్పరపల్లిలో సమావేశం నిర్వహించారు.

బద్దం మైపాల్ రెడ్డి మాట్లాడుతూ...రాబోయే వినాయక చవితి సందర్భంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ తరఫున ఉత్సవ సమితి ప్రతి మండలం, ప్రతి డివిజన్ ,కమిటీ ఏర్పాటు చేసి రాజేందర్ నగర్ అసెంబ్లీ లో ఎన్ని మండపాలు ఏర్పాటు చేయనున్నారని చర్చించారు. ప్రతి మండపాల సంఖ్య అలాగే వారికి ఏ ఇబ్బందులు ,ఉన్నా పోలీస్ వారితో, కానీ జిహెచ్ఎంసి, కానీ మున్సిపాలిటీలతో, కానీ రోడ్లు, డ్రైనేజీలు, మరియు వీధిలైట్లు ఇవన్నీ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ తరఫున ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు తీసుకుపోవాలని భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సైబరాబాద్ ఇన్చార్జి కన్వీనర్ బద్దం మైపాల్ రెడ్డి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రమేష్ బాబు ఈ కార్యక్రమంలో నాయకులు, ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు అంజన్ కుమార్ గౌడ్, మల్లారెడ్డి ,కొమురయ్య మల్లేష్ యాదవ్, మహా లింగం గౌడ్, నారాయణ ,ఎస్ మల్లారెడ్డి, సత్యనారాయణ, బిక్షపతి యాదవ్, బాబురావు ,జనార్ధన్ విజయ్, నాగేష్, మురళీధర్ రెడ్డి, కిరణ్ చారి మధుసూదన్ రెడ్డి ,జైదీప్ శ్రీకాంత్ రెడ్డి,రాజ్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఇగా డిశ్రీరామ్ మోహన్

**మెహదీపట్నం, ఆగస్టు24(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ నూతన సూపర్డెంట్ ఇంజనీరుగా డి.రామ్మోహన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. శనివారం మెహిదీపట్నంలోని నానల్ చౌరస్తాలో గల ఎస్ ఈ కార్యాలయంలో రామ్మోహన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్ ఈ గా పదవి బాధ్యతలు స్వీకరించి న రామ్మోహన్ కు డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) రామచంద్రయ్య పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రామ్మోహన్ మేడ్చల్ ఎస్సీగా పనిచేసే రాజేంద్రనగర్ కు బదిలీపై వచ్చారు. రాజేంద్రనగర్ లో ఎస్ ఈ గా పనిచేసిన ఎల్ గోపయ్య సికింద్రాబాద్ సర్కిల్ ఏసీగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ ఈ రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాను సారం విద్యుత్ వినియోగదారులకు సేవలు అందిస్తూ ఎలాంటి సమస్యలు లేకుండా ముందుకు వెళ్తామన్నారు.


రాజేంద్రనగర్ సర్కిల్ నూతన ఎస్ ఈ శ్రీరామ్ మోహన్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న డి ఈ రామచంద్రయ్య

## రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా వై.శ్రీధర్

**బుద్వేల్, ఆగస్టు 24(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి సమావేశం శనివారం సాయంత్రం ఉప్పర్ పల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధి గణేష్ ఉత్సవ సమితీ కన్వీనర్ బద్దం మహిపాల్ రెడ్డి, భాగ్యనగరం గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రమేష్‌లు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు బాలగంగాధర్ తిలక్ హిందూ ఐక్యత కోసం ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలు సామూహిక నిజ్జనాలు ఊరేగింపులు మన ఐక్యత పెరుగుతుందని అన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 1983లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పిటి టైగర్ ఆలె నరేంద్ర. బద్దం బలరెడ్డి, బండారు దత్తాత్రేయల ఆధ్వర్యంలో సామూహిక ఊరేగింపుగా వినాయ కులను ట్యాంక్ బండ్‌లో సామూహిక నిమజ్జనం చేయడం జరిగిందన్నారు.


రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా వై శ్రీధర్

రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా వై.శ్రీధర్ నియ మితులయ్యారు. జాయింట్ కన్వీనర్లుగా బొక్క బాల్ రెడ్డి, రాజ్ పాల్ రెడ్డి నియనింప బడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి అంజన్ కుమార్, మైలర్ దేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మల్లా రెడ్డి, పి మల్లేష్ యాదవ్, బి మహాలింగం జిల్లా కార్యదర్శి ఎం కొమరయ్య, బీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు లక్మి నారాయణ , డివిజన్ అధ్యక్షులు జి బాబురావు. ఎస్. విజయ్ కుమార్ ఏ. జనార్ధన్. భిక్షపతియాదవ్ . నిఖిల్. నాగేష్ మురళీ ధర్ రెడ్డి జగన్ పి స్ మల్లారెడ్డి శ్రీకాంత్ రెడ్డి కిరణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు

**రాజేంద్రనగర్, ఆగస్టు24(నమస్తే ఉదయం):**
బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ పరిధిలో శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కార్పొరేటర్ లంకల నిఖిలా సంగారెడ్డి మేయర్ లతా ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డితో కలిసి కోటి రూపాయల నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కిస్మత్పూర్ బిడ్జి ఇరువైపులా పెన్సింగ్ , శ్రీకృష్ణ కాలనీలో పెద్దల కమ్యూనిటీ హాల్, అపోలో ఫార్మసీ నుండి స్వామి వివేకానంద


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

విగ్రహం వరకు బిటి రోడ్ తదితర పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలో మూడు కోట్ల 25 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఈ సందర్భంగా కార్పొరేటర్ నిఖిలా సంగారెడ్డి తెలిపారు ప్రస్తుతం ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ చేతుల మీదుగా కోటి రూపాయలతో పనులకు శంకుస్థాపన చేయించినట్టు వెల్లడించారు. మిగిలిన రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు టెండర్లలో ఉన్నాయని వాటిని పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిస్మత్పూర్ గ్రామ పెద్దలు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలుమున్సిపాలిటీ కమీషనర్‌తో పాటు వివిధ విభాగాల అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.




మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్‌ను సన్మానించిన భవాని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీలో సిసి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కాలనీవాసులు

# ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు

### భవాని కాలనీలో1.63 కోట్లతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**బండ్లగూడ, ఆగస్టు24(నమస్తే ఉదయం):**
అభివృద్ధి పనులు ప్రణాళిక బద్ధంగా చేపట్టి ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అధికారులను ఆదేశించారు.

సిసి రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఈరోజు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8 వార్డు నందుగల భవాని కాలనీలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మేయర్ లతా ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ భూపాల్ గౌడ్ ఇతరత్రా కార్పొరేటర్స్ మరి అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర , డిఈ , ఏఈ , వర్క్ ఇన్స్పెక్టర్ వినయ్ గారు, వార్డ్ ఆఫీసర్ సూర్యప్రకాష్ , ఇతర ముఖ్య అధికారులు పర్యటించి శంకుస్థాపన కార్య క్రమాన్ని ప్రారంభించడం జరిగింది. భవాని కాలనీ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శైలజా జ్ఞానేష్, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ట్రెజరర్ నాగేశ్వర్ రెడ్డి కమిటీ సభ్యులు చక్రధర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, రాజ్ కుమార్, కిరణ్ బుద్దే, తిరుపతి రెడ్డి మరియు కాలనీ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు సాదరంగా ఆహ్వానం పలికి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శనివారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9.13 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ గౌడ్, డ్యూటీ మేయర్ పులపల్లి రాజేందర్ రెడ్డి, కమిషనర్ శరత్ చంద్ర తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.

కార్పొరేషన్ పరిధిలోని 8 వార్డులో( భవాని కాలనీ)లో స్థానిక కార్పొరేటర్ భూపాల్ గౌడ్‌తో కలిసి 1.63 కోటతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... అభివృద్ధిలో కాలనీ అసోసియేషన్లుభాగస్వాములు కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డిఈ, ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్ వినయ్, వార్డ్ ఆఫీసర్ సూర్యప్రకాష్, అధికారులు పాల్గొన్నారు. భవాని కాలనీ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శైలజా జ్ఞానేష్, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ట్రెజరర్ నాగేశ్వర్ రెడ్డి కమిటీ సభ్యులు చక్రధర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, రాజ్ కుమార్, కిరణ్ బుద్దే, తిరుపతి రెడ్డి మరియు కాలనీ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు సాదరంగా ఆహ్వానం పలికి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే ముఖ్య అతిథిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి

**మొయినాబాద్,24(నమస్తే ఉదయం):**
విద్యార్థులు ఉన్నత విద్యలో పాల్గొనే వారందరు సంపూర్ణ అభి వృద్ధికి సమర్థవంతమైన విద్యను అభ్యసించినప్పుడే మీ జీవి తాలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, అనురాగ్ విద్యా సంస్థల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్ నగర్ చౌరస్తాలో గల విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రొగ్రాము ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేసి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన అధ్యాపకులతో పాటు పరిశోధన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు రెగ్యూలర్‌గా కళాశాలలకు హాజరై క్రమ శిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. సాంకేతిక రంగంలో నైపుణ్యం పెంచుకునే విద్యార్థులకు అపారమైన అవకాశాలు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు సంపూర్ణమైన అభివృద్ధికి, సమర్థవంతమైన కమ్యూనికేషన్, నైపుణ్యమే ప్రధానమని సూచించారు. ఒక పక్కా విద్యా సంస్థ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తుందని మరో పక్క తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి వారి నడవడికలను తెలుసుకోవాలన్నారు. కేవలం కళాశాలకు పంపుతున్నామని అనుకోని సరిపోతే కాదని వారి




పట్ల మీ కృషి కూడా ఉండాలని ఆయన సూచించారు. నాలుగు సంవత్సరాల పాటు కష్టం అనకుండా ఇష్టంతో విద్యార్థులు చదువుకుంటే మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చినవారు అవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిబాబారెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ పద్మజ, అకాడామిక్ కోఆర్డినేటర్ శ్రీలత, కళాశాల ఏవో వెంకటాచలం, హెచ్ఒడీలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలసిన కురుమ సంఘం నాయకులు

**రాజేంద్రనగర్, ఆగస్టు24(నమస్తే ఉదయం):**
బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సభ్యులు శనివారం ఉదయం కార్పొరేటర్ సాగర్ గౌడ్, కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్ గౌడ్‌ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్ కొత్తగా ఎన్నికైన సంఘం సభ్యులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు పరిచయం చేశారు. ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్, గండిపేట్ మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఈదలకంటి యాదయ్య ఆధ్వర్యంలో సంఘం సభ్యులు భవన నిర్మాణం కోసం స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంట నని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు కె.నరేష్ కుమార్. మల్లేష్, విజయ్ కుమార్, కె.వెంకట్, పి.రమేష్, జనరల్ సెక్రటరీలు కె.లక్ష్మణ్. కె.సత్యనారాయణా,ఎస్.విట్టలయ్య,ఎం.జగదీశ్వర్, ప్రచార కార్యదర్శి బుడిగె బాబురావు, కార్యవర్గ సభ్యులు డి.బాల కృష్ణ పి మనోహర్ పి బాలరాజు, ఎం .సతీష్ ఏ సాయికాంత్, ఎం శ్రీశైలం,బి ఆంజనేయులు, కె సత్యనారాయణ, ఏ శ్రీశైలం. బి రమేష్.టీ నర్సింలు,జి కృష్ణయ్య వి వెంకటేష్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలసిన కురుమ సంఘం నాయకులు

## హిమాయత్ నగర్‌లో ఐరా రెస్టారెంటు ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**మొయినాబాద్,24(నమస్తే ఉదయం):**
నగర శివారు మొయినాబాద్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అందుకు అనుగుణంగా ప్రజలకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని. నూతనంగా ఏర్పాటు చేసే రెస్టారెంటు నిర్వహకులు వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్లో స్థానికులు తెర రాజగోపాల్రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాట్, సంపత్లు నూతనంగా ఏర్పాటు చేసిన ఐరా రెస్టారెంటు ప్రారంభోత్సవంలో శనివారం ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఫుడ్ సెక్యూరిటీ నిబంధలకు అనుగుణంగా ఆహారాన్ని వినియోగదారులకు అందించినప్పుడే ప్రజల్లో మ ంచి అభిప్రాయం ఏర్పడుతుందని చెప్పారు. దినదిన



అభివృద్ధి చెందుతున్న మొయినాబాద్‌లో ఇలాంటి బహుల అంతస్తుల హోటళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల జీవనశైలిలో మార్పు వస్తుంటుందని చెప్పారు. ఇటీవల నగరంలో అనేక హోటల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఫుడ్ సెక్యూరిటీ అధికారులు హోటళ్లను మూసి వేసినట్లు మంత్రి గుర్తుచేశారు. నగర శివారు మొయినాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని అందుకు అనుగుణంగా వసతులు కూడా ఏర్పాటవుతుండడం ఎంతో అభినందనీయమన్నారు. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుల డడం.. తమ ప్రభుత్వం కూడా మరింత సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ భీంభరత్, సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కీసరి సంజీవరెడ్డి హోటల్ నిర్వహకులు పాల్గొన్నారు.

# కల్కి-2లో ప్రభాస్‌ను మరింత బెస్ట్‌గా చూపిస్తాం...

**- అర్షద్ వార్సీ వ్యాఖ్యలకు స్పందించిన నాగ్ అశ్విన్**

బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ వ్యాఖ్యలపై కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. 'కల్కి' సినిమాలో ఓ సన్నివేశాన్ని పోస్ట్ చేసిన నెటిజన్.. ఈ ఒక్క సీన్ బాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తంతో సమానం అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై నాగ్‌అశ్విన్ స్పందిస్తూ.. టాలీవుడ్, బాలీవుడ్ అని విడదీసి మాట్లాడొద్దన్నారు. 'నార్త్-సౌత్, టాలీవుడ్ వెర్సస్ బాలీవుడ్.. ఇలా పోలుస్తూ వెనక్కి వెళ్లొద్దు. మనమందరం ఒక ఇండస్ట్రీకి చెందినవాళ్లమే. అర్షద్ కొంచెం హుందాగా మాట్లాడాల్సింది. అయినా ఫర్వాలేదు. మేము అతడి పిల్లల కోసం 'కల్కి' బుజ్జి బొమ్మలు పంపిస్తాం. కల్కి రెండోభాగం కోసం మరింత కష్టపడి పనిచేస్తాను. అందులో ప్రభాస్‌ను బెస్ట్‌గా చూపిస్తాను అని రాసుకొచ్చారు. ప్రపంచంలో చాలామంది మనల్ని ద్వేషిస్తారు. కానీ, మనం వాటిని పట్టించుకోకుండా ముందుకెళ్లాలి అని నాగ్‌అశ్విన్ చెప్పారు. ప్రభాస్ కూడా ఇదే మాట అంటుంటారని ఆయన తెలిపారు. మరోవైపు ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన కామెంట్స్ తీవ్ర చర్చనీయాంశం గా మారుతున్నాయి. వీటిని ఖండిస్తూ పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఈ అంశంపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు బాలీవుడ్ మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు లేఖ రాశారు. అభిప్రాయాల్ని వ్యక్తపరిచే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, అర్షద్ చేసిన వ్యాఖ్యలు ప్రభాస్‌ని తక్కువ చేసేలా, వ్యతిరేకతకు కారణమయ్యేలా ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆయనకు సూచనలు చేస్తారని ఆశిస్తున్నాం. ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా నటీనటులంతా గౌరవంగా ఉండాలని కోరుతున్నాం. మనమంతా ఒకే కుటుంబంలో భాగమని గుర్తుంచుకోవాలి. ఈ ఐక్యతని కాపాడుకుందాం అంటూ అసోసియేషన్ అధ్యక్షురాలు పూనమ్ ధిల్లాన్‌కు రాసిన లేఖలో విష్ణు పేర్కొన్నారు.



# సరిపోదా శనివారం 29న విడుదల



సెన్సార్ పూర్తి చేసుకున్నట్లు ప్రకటన

నాని కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' .. నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తుండగా.. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. తమిళ నటుడు ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వరుసగా మూవీ ప్రమోషన్స్ చేస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నట్లు నాని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. ఈ సందర్భంగా ఒక వీడియోను కూడా వదిలాడు. 'సరిపోదా శనివారం' సెన్సార్ కంప్లీట్ అయ్యింది. సెన్సార్ బోర్డ్ ఑/ం సర్టిఫికెట్ ఇచ్చింది. అలాగే 2 గంటల 35 నిమిషాలు రన్ టైం అని నాని చెప్పగా.. వెనక నుంచి ఎస్‌జే సూర్య వచ్చి ప్లస్ 15 మినిట్స్ అంటాడు. మొత్తం 2 గంటల 50 నిమిషాలు అంటే సుందరానికి కూడా ఇదే రన్ టైం కదా అంటూ ఎస్‌జే సూర్య అనగా.. అంటే కాదు.. 'సరిపోదా శనివారం' అంటూ నాని అనడం ఇది ఒక యాక్షన్ మూవీ అండ్ లవ్ స్టోరీ అంటూ వీడియోను వదిలారు.




# రాజాసాబ్ షూటింగ్ ఇలా..!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా బ్యాక్ టు బ్యాక్ సలార్, కల్కి సినిమాలతో విజయాలను సొంతం చేసుకున్నాడు. ఆ రెండు సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజా సాబ్ సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా సినిమా ఉంటుంది అనే నమ్మకంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ లుక్ చూసిన తర్వాత చాలా మంది కూడా ఇది మరో విజయాన్ని ఆయనకు కట్టబెట్టడం ఖాయం అంటూ ధీమాతో ఉన్నారు. మొన్నటి వరకు టైం ఉన్నప్పుడు మాత్రమే రాజాసాబ్ కి డేట్లు ఇస్తూ వచ్చిన ప్రభాస్ ఇప్పుడు రెగ్యులర్ గా షూటింగ్ లో పాల్గొంటున్నట్లుగా సమాచారం అందుతోంది. ప్రభాస్ రాజాసాబ్ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ లో జరుగుతోంది. 38 వేల చదరపు అడుగుల భారీ సెట్టింగ్ ను ఈ సినిమా కోసం ఏర్పాటు చేయడం జరిగిందట. ఆ సెట్టింగ్ లో ఏర్పాటు చేసిన ఒక గ్రీన్ మ్యాట్ కి అవతల వైపు ప్రభాస్ ఉన్న ఫోటోలను కొందరు తీసి వాటిని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాజాసాబ్ సినిమా షూటింగ్ ను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేసే విధంగా దర్శకుడు మారుతి ప్లాన్ చేస్తున్నాడు అంటూ చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. వచ్చే సమ్మర్ లో ఈ సినిమాను విడుదల చేస్తారని సమాచారం అందుతోంది. ఏప్రిల్ 10న ఈ సినిమా ను విడుదల చేయాలని మారుతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు.

సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో హీరోయిన్స్ గా ముగ్గురు ముద్దుగుమ్మలు నటిస్తున్నారు. ఇటీవలే విడుదల అయిన గ్లిమ్స్ కి మంచి రెస్పాన్స్ దక్కింది. సితార బిగ్ అప్డేట్! ప్రభాస్ రాజాసాబ్ సినిమాతో పాటు కల్కి 2, సలార్ 2 ఇంకా స్పిరిట్ సినిమాల్లో నటిస్తున్నాడు.

# సామ్ న్యూ లుక్



స్టార్ హీరోయిన్ సమంత.. ఈ మధ్య వార్తల్లో బాగా నిలుస్తోంది. మయోసైటిస్ బారిన పడ్డ తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన ఆమెను మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు అభిమానులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అయితే అమ్మడు ఎప్పుడో పూర్తి చేసిన సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ మరికొద్ది రోజుల్లో స్ట్రీమింగ్ కానుంది. తన బ్యానర్ పై ఓ సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. మరిన్ని ప్రాజెక్టుల విషయంలో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది సమంత. తన ఫ్యాన్స్ కోసం ఎప్పటికప్పుడు కొత్త పిక్స్ షేర్ చేసుకుంటోంది. హెల్త్ కు సంబంధించిన పలు విషయాలు పోస్ట్ చేస్తుంటుంది. అదే సమయంలో ఈ మధ్య ఓ స్పెషల్ అప్డేట్ అని చెప్పి.. పికిల్ బాల్ లీగ్‌లో చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. అప్పుడు సామ్.. డెనిమ్ జీన్స్, బ్లాక్ కలర్ పోలో టీ షర్ట్ లో కాస్త ఫిట్ గా కనిపించింది. కానీ ఆమె బాగా సన్నబడిందని నెటిజన్లు కామెంట్స్ పెట్టారుఇటీవల ముంబైలో జరిగిన అనామికా ఖన్నా X H&M కలెక్షన్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ కలర్ డ్రెస్ లో సమంత తళుక్కుమంది. ఫాబ్రిక్ పెయింట్ డిజైన్ డ్రెస్ అదిరిపోయినా.. సామ్ పిక్స్ చూసి మాత్రం షాకయ్యామని ఫ్యాన్స్ చెబుతున్నారు. పూర్తిగా ఆమె మారిపోయినట్లు కనిపిస్తోందని అంటున్నారు. అదేంటి ఎందుకు అలా అయిపోయిందని కామెంట్స్ పెడుతున్నారు. ఒక్కసారిగా బాగా వెయిట్ తగ్గడం చూస్తుంటే షాకింగ్ గా ఉందని అంటున్నారు. సామ్ ఫేస్ లో అప్పటి గ్లో కనిపించడం లేదని చెబుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. పర్సనల్ రీజన్ వల్ల సన్నబడిందా, లేక మయోసైటిస్ చికిత్సలో భాగంగా స్లిమ్ అయిందా అని అనుమానపడుతున్నారు.

# అమరన్ తెలుగు థియేట్రికల్ హక్కులను పొందిన శ్రేష్ఠ్ మూవీస్

కమల్ హాసన్‌కు చెందిన ఆర్‌కెఎఫ్‌ఐ & సోనీ పిక్చర్స్ ఇంటర్నే షనల్ ప్రొడక్షన్స్, శివకార్తికేయన్, రాజ్‌కుమార్ పెరియ సామిల అమరన్ తెలుగు థియేట్రికల్ హక్కులను సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి యొక్క శ్రేష్ఠ్ మూవీస్ పొందారు. ప్రిన్స్ శివకార్తికేయన్ ద్విబాషా యాక్షన్ చిత్రం అమరన్. ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియసామి రచన, దర్శకత్వం వహించారు, ఉలగనాయగన్ కమల్ హాసన్, మిస్టర్.ఆర్. మహేంద్రన్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ దీపావళి అక్టోబర్ 31న చిత్రం థియేటర్‌లలో విడుదలకు సిద్ధంగా ఉంది. కాగా, హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి, అతని సోదరి నిఖితారెడ్డి ఈ సినిమా ఏపీ, టీఎస్‌ల థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శ్రేష్ట్ మూవీస్ బ్యానర్ ద్వారా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సెన్సేషనల్ హిట్ విక్రమ్ తర్వాత కమల్ హాసన్ ప్రొడక్షన్ హౌస్‌తో శ్రేష్ట్ మూవీస్‌కి ఇది రెండవ చిత్రం కావడం విశేషం. విక్రమ్ చిత్రం సమయంలో చేసిన



ప్రమోషన్లు, భారీ విడుదల కోసం సుధాకర్ రెడ్డి చేసిన ప్రయత్నాన్ని కమల్ హాసన్ తన సంతృప్తిని వ్యక్తం చేశారు.

# 'మట్కా' డబుల్ ఇంపాక్ట్ ఫస్ట్‌లుక్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన మోస్ట్ ఎక్స్ పెన్సీవ్ మూవీ 'మట్కా'తో పాన్ ఇండియాలో అడుగు పెడుతున్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి మూవీని మ్యాసీవ్ స్కేల్‌లో నిర్మిస్తు న్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఇది వరుణ్ తేజ్‌ను యంగ్ స్టర్, అండ్ మిడిల్ ఏజ్ మ్యాన్‌గా రెండు డిఫరెంట్ అవతార్స్‌లో ప్రజెంట్ చేసింది. సినిమాలో నాలుగు డిఫరెంట్ గెటప్‌లలో హీరో 24 ఏళ్ల జర్నీని అద్భుతంగా చూపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అండర్‌డాగ్ నుంచి ఓవర్‌లార్డ్ వరకు రెండు షేడ్‌లు కనిపిస్తున్నాయి. అతను తన టెరిటరీకి రాజుగా ఎదుగుతాడు.

సిగార్ తాగుతూ ఇంటెన్స్‌గా కనిపించిన హీరో డాన్ ఇమేజ్‌లో యూత్, డాషింగ్‌గా కనిపించారు. అతని డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ వింటేజ్ వైబ్ లో అదిరిపోయాయి. రెండు లుక్స్ రిచ్ అండ్ స్టయిలీష్ గా వున్నాయి. తన టేబుల్ మీద తుపాకీ ఉంది. ప్లే కార్డులలో కింగ్ కార్డ్ బ్యాక్ డ్రాప్‌గా వుంది. వరుణ్ తేజ్ డిఫరెంట్ షెడ్స్ లో కనిపించిన ఈ ఫస్ట్ లుక్ డబుల్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733